క్లుప్తంగా

రూ.50 వేల విరాళం



అన్నదానానికి విరాళం ఇస్తున్న దాతలు

కపిలేశ్వరపురం: అంగరలోని వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శాశ్వత అన్నదానానికి అదే గ్రామానికి చెందిన పెద్దింశెట్టి సూర్యచంద్రరావు, మంగాదేవి దంపతుల కుమారులు పెద్దింశెట్టి కృష్ణసాయి వీరనాగరామ్, దివ్య దుర్గా ఫణి పద్మకుమార్‌లు శనివారం రూ.50,116 విరాళంగా సమర్పించారు. విరాళం సొమ్మును దాతల తాత, నాన్నమ్మలు పెద్దింశెట్టి నాగేశ్వరరావు, పళ్ళాలమ్మ, తల్లిదండ్రులు సూర్యచంద్రరావు, మంగాదేవి చేతుల మీదుగా ఆలయ నిర్వాహక కమిటీ ప్రతినిధులు పెద్దింశెట్టి రామస్వామి, వీరబాబు, సూరంపూడి వెంకట్రావులకు అందజేశారు.

బాధిత కుటుంబాలకు నిత్యావసరాల పంపిణీ



బాధిత కుటుంబానికి నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న చంద్రశేఖర్ తదితరులు

కె.గంగవరం: మండలంలోని పాతకోట, సుందరపల్లి గ్రామాల్లో ఇటీవల ఆప్తులను కోల్పోయిన కుటుంబాలకు శనివారం దాతలు నిత్యావసరాలు పంపిణీ చేశారు. పాతకోట గ్రామానికి చెందిన మాసాబత్తుల అభిలాష్, సుందరపల్లి గ్రామానికి చెందిన కొమ్ము వెంకటేశ్వరరావు ఇటీవల మృతి చెందాడు. ఈ నేపథ్యంలో వారి కుటుంబాలను జనసేన నాయకులు పోలిశెట్టి చంద్రశేఖర్ పరామర్శించి డొక్కా సీతమ్మ ఆసరా పథకం ద్వారా పోలిశెట్టి లక్ష్మీ సుబ్బారావు చారిటబుల్ మెమోరియల్ ఫౌండేషన్ తరఫున బియ్యం, కూరగాయలతో పాటు నిత్యావసరాలు పంపిణీ చేశారు.

ఘనంగా అన్నసమారాధన

కాజులూరు: మండలంలోని గొల్లపాలెం ధనలక్ష్మీపేట రామాలయం వద్ద గ్రామస్తులు భారీ అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. గత 30వ తేదీ గురువారం ఆలయంలో సీతారాముల కల్యాణం మహోత్సవాలు ఘనంగా జరిగాయి. కల్యాణ మహోత్సవాల్లో స్వామికి వచ్చిన విరాళాలకు తోడు పలువురి దాతల సహకారంతో ఈ అన్నసమారాధన నిర్వహించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఏటా సీతారాముల కల్యాణం అనంతరం అన్నసమారాధన నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని భక్తులు తెలిపారు. పరిసర గ్రామాలకు చెందిన సుమారు వెయ్యి మంది భక్తులు ఈ అన్నసమారాధనలో పాల్గొని స్వామి ప్రసాదాన్ని స్వీకరించారు.

ముగిసిన సువార్త సంగీత పండగలు

కపిలేశ్వరపురం: మండలంలోని పడమర ఖండ్రిక గ్రామంలోని సెంటినరీ బాప్టిస్ట్ చర్చిలో మూడు రోజుల పాటు నిర్వహించిన క్రైస్తవ రక్షణ సువార్త సంగీత పండగలు శుక్రవారంతో ముగిశాయి. చర్చి పాస్టర్ జి.రూబెన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగింపు కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ యువ నేత, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు తనయుడు తోట పృథ్వీరాజ్ అతిథిగా హాజరయ్యారు. క్రమశిక్షణ, భక్తి శ్రద్ధలతో ప్రపంచ శాంతికోసం ప్రార్థనలు చేసిన నిర్వాహకులను, క్రైస్తవ భక్తులను అభినందించారు. కార్యక్రమంలో పంచాయతీ సర్పంచ్ వాసా కోటేశ్వరరావు, ఉప సర్పంచ్ యర్రా వీరన్నబాబు, నాయకులు పాలింగి కిశోర్, శ్రీను, మట్టపర్తి పాల్‌రాజ్, వంగా శ్రీనివాస్, క్రైస్తవ భక్తులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు



పాణింగపల్లిలో ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలు కేంద్రం

కె.గంగవరం: మండల జలోని పాణింగపల్లి రైతు భరోసా కేంద్రం వద్ద శనివారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాన్ని సొసైటీ అధ్యక్షుడు వైట్ల అచ్యుత రాంప్రసాద్, సర్పంచ్ చీకట్ల సునీత, వైస్ ఎంపీపీ నీతిపూడి మధుబాల తదితరులు కొబ్బరికాయ కొట్టి కాటాకు పూజ చేసి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి రైతుకు గిట్టుబాటు ధర సకాలంలో అందించేందుకు చర్యలు తీసుకుందన్నారు. దీనిలో భాగంగానే ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశామని రైతులు సద్వినియోగం చేసుకుని తమ ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోవద్దని కేంద్రాల వద్దనే అమ్మకాలు జరపాలని విజ్ఞప్తి చేశారు. వ్యవసాయ సహాయకులు బండారు శ్రీరాములు, స్థానిక రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

వేడి నూకల జావ.. వడదెబ్బకు విరుగుడేగా

- రెండు చలివేంద్రాల ఏర్పాటు
- 30 ఏళ్లుగా కొనసాగిస్తున్న ఎస్‌బీఎస్‌ఆర్ చారిటబుల్ ట్రస్టు

మండపేట: వేసవిలో ప్రయాణికులు, బాటసారుల దాహార్తి తీర్చేందుకు స్వచ్ఛంద సంస్థలు, దాతలు చలివేంద్రాలు ఏర్పాటు చేసి చల్లటి నీరు, మజ్జిగ అందించడం పరిపాటి. అయితే మండుటెండలో వేడివేడి నూకల జావను బాటసారులు, ప్రయాణికులకు అందించి డీ హైడ్రేషన్ నుంచి కాపాడుతున్నారు మండలంలోని అర్తమూరుకు చెందిన ఎస్‌బీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ సత్తి బులిస్వామి రెడ్డి. ఒకటి కాదు,రెండు కాదు మూడు దశాబ్దాలుగా నూకల జావను అందిస్తూ వేసవి ఉపశమనం కోసం పూర్వం పెద్దలు చెప్పిన సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు.

నూకలను గంటల కొద్దీ ఉడికించి అందులో ఉప్పు, నిమ్మరసం, మజ్జిగ కలిపి వేడి నూకల జావను తయారు చేస్తుంటారు. పూర్వం వేసవిలో వడదెబ్బ బారిన పడకుండా వేడి నూకల జావను తాగే వారమని పెద్దలు చెబుతుంటారు. ఈ జావ అలసటను తీర్చి త్వరితగతిన శక్తిని ఇస్తుందని చెబుతుంటారు. వేసవి ఎండల్లో సాయంత్ర వేళల్లో అన్నం ఉడికించగా వచ్చిన గంజిలో నిమ్మరసం కలుపుకుని తాగడం ద్వారా డీ హైడ్రేషన్‌కు గురికాకుండా ఉండే వారమంటారు. చలివేంద్రాల్లో అదే సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు బులిస్వామిరెడ్డి. వ్యయ ప్రయాసలకోర్చి గత మూడు దశాబ్దాలుగా తన చిన్నతనంలోని సంప్రదాయ చలివేంద్రాలను ఏర్పాటు చేస్తూ బాటసారుల వేసవి తాపాన్ని తీరుస్తున్నారు. ఈ ఏడాది ఎస్‌బీఎస్‌ఆర్ చారిటబుల్ ట్రస్టు ద్వారా మండలంలోని తాపేశ్వరంతో పాటు మండపేట – రామచంద్రపురం రోడ్డులోని తుపాకుల తూము వద్ద చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి వేడివేడిగా నూకల జావను పంపిణీ చేస్తున్నారు. పని మనిషి జీతం, కట్టెలు, నూకలు, మజ్జిగ తదితర వాటితో రెండుచోట్ల వేసవి మొత్తం చలివేంద్రాల నిర్వహణకు రూ.1.5 లక్షల వరకూ వ్యయమవుతున్నట్టు అంచనా. ప్రయాణికులు, బాటసారులతో పాటు వేడినూకల జావ విశిష్టతను గూర్చి తెలిసిన వారు పనిగట్టుకుని మరీ ఆయా చలివేంద్రాల వద్దకు వచ్చి ఆజావను బాటిళ్లలో తీసుకు వెళుతున్నారు.



అర్తమూరు తూము వద్ద వేడినూకల జావను పంపిణీ చేస్తున్న బులిస్వామిరెడ్డి

సంప్రదాయాన్ని కొనసాగించాలనే



గతంలో తాపేశ్వరంలో వెంకటరత్నం అనే పెద్దాయన వేసవిలో వేడి నూకల జావ పంపిణీ చేసేవారు. ఆయన స్ఫూర్తితో మూడు దశాబ్దాల క్రితం ట్రస్టు ఆధ్వర్యంలో చలి వేంద్రాలను ఏర్పాటు చేయడం మొదలెట్టాం. ఏటా వేసవికాలం అంతా అదే సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నాం.

– బులిస్వామిరెడ్డి, ఎస్‌బీఎస్‌ఆర్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్, అర్తమూరు

ఎంతో ఉపశమనం ఇస్తుంది



పనికి వెళుతూ అర్తమూరు తూము వద్ద ఆగి వేడినూకల జావ తాగుతుంటాం. అలసట తీరిపోయి ఎంతో ఉపశమనంగా ఉంటుంది. దారిన వెళ్లే వారు ఎంతో మంది ఇక్కడ జావను తాగి వెళుతుంటారు.

– తాతరావు, ప్రయాణికుడు

సీఎం జగన్‌కు వివాహ ఆహ్వాన పత్రిక



సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న కడప జిల్లా డీఎఫ్‌వో సందీప్‌రెడ్డి, కుటుంబ సభ్యులు

రాయవరం: మండలంలోని పసలపూడికి చెందిన ఐఎఫ్ఎస్ క్యాడర్ అధికారి పీవీ సందీప్ రెడ్డి తన వివాహానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆహ్వానిస్తూ వివాహ ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ విషయాన్ని సందీప్‌రెడ్డి తల్లిదండ్రులు పి.విజయభాస్కరరెడ్డి, శ్రీవాణి దంపతులు శనివారం విలేకరులకు తెలిపారు. సందీప్‌రెడ్డి కడప జిల్లా డీఎఫ్‌వోగా విధులు నిర్వర్తిస్తున్నారు. వచ్చే నెల 3న రాజమహేంద్రవరంలో జరగనున్న వివాహానికి ఆహ్వానిస్తూ వివాహ శుభ లేఖను అందజేశారు. వారితో పాటు సందీప్‌రెడ్డి సోదరి లక్ష్మీప్రసన్న కూడా ఉన్నారు.

వైఎస్సార్ సీపీతోనే బీసీలకు తగిన గుర్తింపు



మంత్రి వేణుకు పుష్పగుచ్ఛం ఇచ్చి కృతజ్ఞతలు తెలియజేస్తున్న రజక సంఘం నాయకులు

రామచంద్రపురం: రాష్ట్రంతో పాటు రామచంద్రపురం నియోజకవర్గంలోనూ వైఎస్సార్ సీపీతోనే మైనారిటీ బీసీలకు తగిన గుర్తింపు లభించిందని నియోజకవర్గ రజక సంఘం నాయకులు అన్నారు. పట్టణంలోని రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణను ఆయన నివాసంలో శనివారం కలుసుకుని బీసీ జనగణనకు సిద్ధమవడంపై కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గ రజక సంఘం అధ్యక్షుడు గుమ్మడి వీరవెంకటరమణ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత సీఎం జగన్ బీసీల పక్షపాతిగా బీసీల అభ్యున్నతికి బాటలు వేస్తున్నారన్నారు. బీసీల్లో అన్ని వర్గాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. అదే విధంగా గతంలో ఎప్పుడూ లేని విధంగా మైనారిటీ బీసీలకు నియోజకవర్గంలో మంత్రి వేణు తగిన గుర్తింపు ఇచ్చారన్నారు. రజకులలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా, సొసైటీ చైర్మన్‌గా, కౌన్సిలర్‌గా, సర్పంచ్‌గా అవకాశం కల్పించి తగిన గుర్తింపు ఇచ్చారన్నారు. కానీ నియోజకవర్గంలో కొందరు మైనారిటీ బీసీలకు అన్యాయం జరుగుతుందంటూ తమ వ్యక్తిగత స్వార్థం కోసం మైనారిటీ బీసీలను రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారని అటువంటి మాయలో బీసీలు ఎవరూ పడవద్దని వెంకటరమణ అన్నారు. బీసీలకు న్యాయం చేసే పార్టీ వైఎస్సార్ సీపీ మాత్రమే అని, బీసీలంతా సీఎం జగన్, బీసీ మంత్రి వేణులకు వెన్నంటే ఉంటామన్నారు. కార్యక్రమంలో రజక సంఘం నియోజకవర్గ ఉపాధ్యక్షుడు కాకినాడ వెంకటరమణ, నాయకులు కేశనకుర్తి వెంకటేశ్వరరావు, పాలకొల్లు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సీఎం పాలనలో బీసీలకు తగిన ప్రాధాన్యం

కాజులూరు: రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో బీసీలకు తగిన ప్రాధాన్యమిస్తున్నారని మండల బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పెంకే విశ్వేశ్వరరావు అన్నారు. కాజులూరు శివారు చాకిరేవుమెరకలో శనివారం జరిగిన బీసీ నాయకుల సమావేశంలో బీసీ జనగణనకు ప్రభుత్వం సానుకూలంగా అడుగులు వేస్తుండటంపై నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ బీసీలను గత ప్రభుత్వాలు ఓటు బ్యాంకు రాజకీయాల కోసం వాడుకున్నారే తప్ప ఎటువంటి ప్రయోజనాలు చేకూర్చలేదన్నారు. సీఎం జగనన్న బీసీ నేతలైన పిల్లి సుభాష్‌చంద్రబోస్, మోపిదేవి వెంకటరమణ, ఆర్.కృష్ణయ్యకు రాజ్యసభ పదవులు, పలువురికి ఎమ్మెల్సీ పదవులు ఇచ్చారని నేడు బీసీ జనగణనకు చర్యలు చేపట్టి బీసీలపై ఆయనకు ఉన్న చిత్తశుద్ధిని చాటుకున్నారన్నారు. జగనన్న తమ వర్గానికి చేస్తున్న మేలు మరువలేమని బీసీలు ఎప్పటికీ వైఎస్సార్ సీపీకి వెన్నంటి ఉంటారన్నారు. కార్యక్రమంలో సంఘ ప్రధాన కార్యదర్శి నరాళ శ్రీను, ఉపాధ్యక్షుడు దెయ్యాల సత్తిబాబు, ట్రెజరర్ కట్టా సత్యనారాయణ బీసీ నేతలు పితాని సుబ్రహ్మణ్యం, సువ్వారి గోవిందు, పాలిక శివయ్య, గెద్దాడ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిత్వమే మనిషికి నిజమైన సంపద



శామ్యూల్‌రెడ్డిని సత్కరిస్తున్న వాణి తదితరులు

మండపేట: సంపద అంటే కేవలం డబ్బు మాత్రమే కాదని మనిషి సంపాదించే మంచిపేరు, మానవత్వం, నిజాయితీగా ఉండడం, సమాజం పట్ల బాధ్యతగా మెలగడం మనిషి నిజమైన సంపదని స్పందన ఈద ఇంటర్నేషనల్ ఫౌండేషన్ (ఎస్ఈఐఎఫ్) వ్యవస్థాపకుడు డాక్టర్ ఈద శామ్యూల్ అన్నారు. ఎస్ఈఐఎఫ్ జిల్లా ఉపాధ్యక్షురాలు ఎం కేపీ వాణి అధ్యక్షతన స్థానిక సూర్య మినీ ఫంక్షన్ హాలులో శనివారం నిర్వహించిన ఫైనాన్సియల్ వెల్ నెస్ వర్క్‌షాప్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఆర్థిక అవసరాల నిమిత్తం దుబరా లేకుండా డబ్బును ఏ విధంగా ప్రణాళికాబద్ధంగా వెచ్చించాలో అవగాహన కల్పించారు. అనంతరం శామ్యూల్ రెడ్డి వాణి తదితరులు ఘనంగా సత్కరించారు. గౌతమి మున్సిపల్ హైస్కూల్ హెచ్ఎం సీహెచ్ శోభావళి, యూటీఎఫ్ కౌన్సిలర్ కేజీకే రెడ్డి, యూటీఎఫ్ అధ్యక్షుడు పీఆర్‌సీ రెడ్డి, కొండపల్లి సూర్యనారాయణ, గొల్లపుంత జేహెచ్ఎస్ ప్రేయర్ హైస్ పాస్టర్ వీఎన్‌కే రంజన్, వివిధ వర్గాలకు చెందిన ఉద్యోగులు పాల్గొన్నారు.

రోగులకు పౌష్టికాహారం పంపిణీ



ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పౌష్టికాహార కిట్లు పంపిణీ చేస్తున్న చైర్‌పర్సన్ దుర్గారాణి, పృథ్వీరాజ్

మండపేట: ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు జన్మదిన వేడుకలు శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వాస్పత్రిలో ఘనంగా జరిగాయి. యువనేత తోట పృథ్వీరాజ్ ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేసి అందరికీ స్వీట్లు పంచారు. అనంతరం చైర్‌పర్సన్ దుర్గారాణి, పృథ్వీరాజ్‌లు దాదాపు 70 మంది టీబీ వ్యాధిగ్రస్తులకు గుడ్లు, పండ్లు, బ్రెడ్లు, పౌష్టికాహారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ దుర్గారాణి మాట్లాడుతూ మండపేట నియోజకవర్గ అభివృద్ధికి ఎనలేని కృషిచేస్తున్న ఎమ్మెల్సీ తోట నిండునూరేళ్ల ఆయురారోగ్యాలతో ప్రజలకు మరిన్ని సేవలు అందించాలని ఆకాంక్షించారు. అలాగే యువజన విభాగం నాయకుడు చోడే శ్రీకృష్ణ ఆధ్వర్యంలో పార్టీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాజుబాబు కార్యాలయంలో జరిగిన వేడుకల్లో పృథ్వీరాజ్, రాజుబాబు కేక్ కట్‌చేసి వేడుకలు నిర్వహించారు. కార్యాలయానికి విచ్చేసిన పృథ్వీరాజ్‌ను శ్రీకృష్ణ తదితరులు ఘనంగా సత్కరించారు. వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో అర్బన్ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ విప్ పోతంశెట్టి ప్రసాద్, సొసైటీ చైర్మన్ కుక్కల రామారావు, పట్టణ శెట్టిబలిజ సంఘం అధ్యక్షుడు పంపన శ్రీనివాస్, పార్టీ నాయకులు యరమాటి వెంకన్నబాబు, దుగ్గిరాల రాంబాబు, సూరంపూడి సత్యప్రసాద్, పెంకే గంగాధర్, శెట్టి నాగేశ్వరరావు, గోరు అన్నవరం, మహంతి అసిరినాయుడు, షేక్ మస్తాన్, గుమ్మిలేరు శ్రీనివాస్, పేరూరి మాధవి, పిల్లి శివ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్సీ తోట జన్మదిన వేడుకలు

కపిలేశ్వరపురం: ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పుట్టినరోజు వేడుకలను అంగర గాంధీ సెంటర్‌లో శనివారం రాజకీయాలకు అతీతంగా ఘనంగా నిర్వహించారు. జనసేన నాయకులు సూదా తేజ నాయుడు, చిక్కాల రాము ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో డీసీసీబీ మాజీ డైరెక్టర్ సలాది అప్పారావు, నాయకులు కవల శ్రీను, ఉప సర్పంచ్ యర్రా వీరన్నబాబు, ఆలయ చైర్మన్ రామచంద్రరావు తదితరులు కేక్‌ను కట్‌చేశారు. అంగర, పడమర ఖండ్రిక, కోరుమిల్లి తదితర గ్రామాల అభిమానులు స్వీట్లు పంచారు. కార్యక్రమంలో రేలంగి శ్రీను, అడబాల శ్రీను, పాలింగి శ్రీను, వంగా శ్రీనివాస్, సంకాబత్తుల స్వామికాపు, సలాది వీరబాబు పాల్గొన్నారు.

విజయభాస్కరరెడ్డి నియామకంపై హర్షం



సీఎం జగన్‌మోహన్‌రెడ్డితో విజయభాస్కరరెడ్డి

రాయవరం: రాష్ట్ర భూదాన బోర్డు చైర్మన్‌గా పసలపూడికి చెందిన తాడి విజయభాస్కరరెడ్డి నియామకంపై హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. వైఎస్సార్ సీపీలో క్రియాశీలకంగా ఉన్న విజయభాస్కరరెడ్డి క్రమశిక్షణ గల పార్టీ నేతగా ఎదిగారు. పార్టీ కోసం తొలి నుంచి కష్టపడి పనిచేస్తున్న విజయభాస్కరరెడ్డికి సరైన సమయంలో సరైన గుర్తింపు లభించడం పట్ల మండలంలోని పసలపూడి వాసులే కాకుండా, మండపేట, రామచంద్రపురం, అనపర్తి నియోజకవర్గాల పరిధిలోని వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. విజయభాస్కరరెడ్డిని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, జెడ్పీటీసీ సభ్యుడు నల్లమిల్లి మంగతాయారు, ఎంపీపీ నౌడు వెంకటరమణ, వైఎస్సార్ సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు చింతా సుబ్బారెడ్డి, సర్పంచ్ కడలి పద్మావతి, ఉప సర్పంచ్ పోతంశెట్టి సాయిరామ్మోహన్‌రెడ్డి తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

వాలీబాల్ టోర్నీ ప్రారంభం



వాలీబాల్ టోర్నీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

రావులపాలెం: మండలంలోని దేవరపల్లిలో శనివారం ఎస్సీ యూత్ సభ్యులు ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, డాక్టర్ చిర్ల సోమసుందరరెడ్డి మెమోరియల్ వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.

ర్యాలి ఆలయ అభివృద్ధికి రూ.10 వేల విరాళం

ఆత్రేయపురం: పురాణ ప్రసిద్ధి చెందిన ర్యాలి జగన్మోహినీ కేశవస్వామి ఆలయ అభివృద్ధికి రూ.10 వేల విరాళం అందినట్లు ఆలయ ఈఓ బి.కృష్ణచైతన్య తెలిపారు. ఆత్రేయపురంకి చెందిన మంతెన ఆనందరాజు ఈ విరాళం అందించినట్లు తెలిపారు. దాతకు ఆలయ ఈఓ చేతుల మీదుగా స్వామి చిత్రపటం అందజేశారు.

వేంకటేశ్వరునికి ప్రత్యేక పూజలు

ఆలమూరు: వివిధ గ్రామాల్లో వేంచేసిన శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయాలు శనివారం భక్తులతో కిక్కిరిసిపోయాయి. ఆలయాల ఆవరణలో భక్తులు గోవింద నామస్మరణతో ప్రదక్షిణలు చేస్తూ భక్తిపారవశ్యం చెందారు. ఆయా దేవాలయాల ఆలయ పురోహితులు వేద మంత్రోచ్చారణల మధ్య భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఆయా ఆలయాల్లో దేవతామూర్తుల విగ్రహాలను పూల, తులసి మాలలతో అలంకరించిన తీరు భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.

భక్తిశ్రద్ధలతో ఈదుల్ ఫితర్

- ఘనంగా రంజాన్ వేడుకలు
- ఒకరికొకరు ఈద్ ముబారక్ చెప్పుకున్న ముస్లింలు

మండపేట: పవిత్ర రంజాన్ పండుగను ముస్లింలు శనివారం ఘనంగా జరుపుకున్నారు. పిల్లలు, పెద్దలు ఒకరికొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. నూతన వస్త్రాలు ధరించి, పిండి వంటలు చేసి బంధువులు ఒకరికొకరు ఇచ్చిపుచ్చుకున్నారు. పట్టణంలో ముస్లింలు అధికంగా నివసించే గాంధీనగర్, సైదిల్‌పేటలలో పండగ వాతావరణం కనిపించింది. స్థానిక జామియా మసీదు, గాంధీనగర్‌లోని అమీనా మసీదులలో శనివారం తెల్లవారుజాము నుంచి ముస్లింలు ఈదుల్ ఫితర్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. జామియా మసీదులో ఇమామ్ మహ్మద్ ముర్షిద్ రజ్వీ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. ఆయన ఆధ్యాత్మిక ప్రసంగం చేస్తూ ఇస్లాం మతం మంచిని ప్రబోధిస్తుందన్నారు. తోటి మానవులు పడే ఆకలి బాధలు తెలుసుకునేందుకు నెల రోజుల పాటు ఆచరించిన ఉపవాస దీక్షలు ఉపకరిస్తాయన్నారు. ప్రార్థనలు అనంతరం మసీదు ఆవరణలోని శ్మశానవాటికలో పూర్వీకుల సమాధుల వద్ద పుష్ప గుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. మండలంలోని ద్వారపూడిలో రంజాన్ వేడుకలు ఘనంగా జరిగాయి. గ్రామంలోని మదీనా మసీదులో ఇమామ్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ద్వారపూడి, జెడ్.మేడపాడు, కేశవరం తదితర గ్రామాల ముస్లింలు వేడుకల్లో పాల్గొన్నారు.

వారికి అల్లా దయ ఉంటుంది

రాయవరం: తమ సంపాదనలో కొంత పేదలకు దానం చేసే వారిపై అల్లా దయ ఎన్నడూ ఉంటుందని పలువురు ముస్లింపెద్దలు సూచించారు. మండలంలో పలు మసీదుల్లో శనివారం రంజాన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాయవరం, లొల్ల, వెదురుపాక, చెల్లూరు తదితర గ్రామాల మసీదుల్లో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ముస్లింలు ఒకరికొకరు ఈద్ ముబారక్ అంటూ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ప్రార్థనల అనంతరం సేమ్యా, స్వీట్లు, డ్రై ఫ్రూట్స్ పంచారు. వెదురుపాక రంజాన్ వేడుకల్లో మతగురువు హాఫిస్ నాసిర్, మత పెద్ద అహ్మద్ బాషా, ముస్లిం సోదరులు సయ్యద్ బాషా, షేక్ ఖాజాబాబు, షేక్ బాబ్జీ, మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం: అంగరలోని మస్‌జిద్–ఎ–ఇబ్రహీమ మసీదులో శనివారం ఈదుల్ ఫితర్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మసీదు ముతవలి మహ్మద్ అబ్బాస్ హుస్సేన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రార్థనలో ఇమామ్ నాజీం అక్తర్ రంజాన్‌రంజాన్ మాస ప్రత్యేకతను వివరించారు. ఈద్ ప్రార్థన అనంతరం ముస్లింలు ఒకరికొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు చెప్పారు. బరియల్ గ్రౌండ్‌లోని సమాధుల వద్ద పూర్వీకులను స్మరించుకున్నారు. అంగర, పడమర ఖండ్రిక, టేకి, వల్లూరు, నల్లూరు, టేకి గ్రామాల ముస్లింలు, ఇటుక బట్టీలలో పనిచేసేందుకు వలస వచ్చిన కార్మికులతో మసీదు వద్ద సందడి నెలకొంది.

రామచంద్రపురంలో..

రామచంద్రపురం రూరల్: దివ్య ఖురాన్ అవతరించిన పవిత్రమాసం రంజాన్‌ను ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. రంజాన్ మొత్తం పవిత్రంగా ఉపవాస దీక్షలు పాటించారు. పవిత్ర రంజాన్ పర్వదినం ఇస్లాం క్యాలండర్‌లోని 'షవ్వాల్ నెల' మొదటి రోజున ఈద్–ఉల్–ఫితర్ లేక సేమియాల పండగగా పిలుస్తారు. ద్రాక్షారామలోని మూడు మసీదుల్లో శనివారం ఉదయం ఈద్ ఫైత్యాన్ ప్రార్థనలు (నమాజ్), ఫిత్రా దానాలు చేశారు. నమాజ్ అనంతరం పూర్వీకుల సమాధుల వద్దకు ఊరేగింపుగా వెళ్లి తేనీటి విందు ఏర్పాటు చేశారు. పరిసర గ్రామాల నుంచి పెద్ద ఎత్తున ముస్లింలు హాజరయ్యారు. పేదలకు దాన ధర్మాలు చేశారు. ఒకరినొకరు కౌగిలించుకుని ఈద్ ముబారక్‌లు తెలుపుకున్నారు. ఈద్ ప్రసంగంలో అందరూ ప్రేమానురాగాలతో జీవించాలని ఇమాంలు పిలుపునిచ్చారు. షియా జామియా జాఫరీ మసీదు (పెద్ద మసీదు)లో ఇరాన్‌లో విద్యనభ్యసించి వచ్చిన మీర్జా అస్కరి హుస్సేన్ నమాజ్ చేయించారు. మార్కెట్‌లోని జామియా మసీదులో మసీదు కమిటీ అధ్యక్షుడు ఎండీ యాకుబ్ ఆధ్వర్యంలో మత గురువు ఎండీ తసదుక్‌హుస్సేన్ బోధనలు చేశారు. వెలంపాలెం షబాజియా జామియా మసీదులో కమిటీ అధ్యక్షుడు సయ్యద్ ఫాజిల్ అజారుద్దీన్ ఆధ్వర్యంలో మత గురువు గులూస్ రాజా ఆలం ప్రార్థనలు చేశారు. ఇఫ్తార్, సహరి విందులు ఇచ్చిన వారిని గురించి దువా (వేడుకోలు) చేశారు.

రామచంద్రపురం పట్టణంలో..

రామచంద్రపురం: పట్టణంలోని జామియా మసీదులో పవిత్ర రంజాన్ పండగను పురస్కరించుకుని ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఇమామ్ ఆఫీజ్ కమాలుద్దీన్ అల్లా బోధనలలో శాంతి జీవనం సాగించాలని బోధించారు. మసీదు కమిటీ ప్రెసిడెంట్ అబ్దుల్ కరీమ్ ఆధ్వర్యంలో సుమారు వెయ్యి మందికి పైగా ముస్లింలు పాల్గొన్నారు.

కాజులూరులో..

కాజులూరు: మహ్మద్ ప్రవక్త సూచనల మేరకు ఖురాన్ బోధనలు, ప్రవక్తల త్యాగాలు నిత్యం మననం చేసుకుంటూ వాటిననుసరించి జీవితాన్ని గడపగలిగితే అల్లా ఆశీర్వచనాలు పొందినట్లేనని ఇరాన్ నుంచి వచ్చిన ముస్లి మత గురువు మౌలానా అక్బర్ షా అన్నారు. మండలంలోని చేదువాడ, కాజులూరులలో శనివారం ముస్లింలు రంజాన్ వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. ఉదయం స్థానిక మసీదుల్లో ప్రత్యేక నమాజ్‌లు నిర్వహించిన ముస్లింలు పరస్పరం ఒకరికొకరు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం యువకులకు ఖురాన్, నమాజ్ తదితర అంశాలపై ప్రత్యేక పరీక్షలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. మండల గ్రామాలకు చెందిన ఇతర మతస్తులు, గ్రామాల ప్రజలు, పలువురు స్థానిక నాయకులు ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మత పెద్దలు మీర్ ఖాశిం, మీర్జా సమద్, మీర్జా మౌలాలి, అబ్బాస్, మహ్మద్ పాషాసాహెబ్, హుసేన్ పాల్గొన్నారు.



మండపేట జామియా మసీదులో ప్రత్యేక ప్రార్థనల్లో ముస్లింలు



వెదురుపాక మస్జిద్–ఇ–ఖయ్యాత్ మసీదులో..



అంగర మసీదులో..



కాజులూరు మండలం చేదువాడ మసీదులో నమాజ్ నిర్వహిస్తున్న ముస్లింలు



ద్రాక్షారామ పెద్ద మసీదులో నమాజ్ చేస్తున్న ముస్లింలు